# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 21-10-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ శాంతి భద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.
- ❖ న్యూ సౌత్ వేల్స్, ఆంధ్రప్రదేశ్ మధ్య వివిధ రంగాలలో అభివృద్ధి సాధించేందుకు పరస్పర సహకారం ఉండాలని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.
- ❖ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపటి నుంచి 3 రోజుల పాటు యూఏఈలో పర్యటించనున్నారు.
- ❖ ఉపరితల ఆవర్తనం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో బలపడి రేపటికి వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.

======================

రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని 6వ బెటాలియన్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని ఈ రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. శాంతి భద్రతల పట్ల పోలీసులు కఠినంగా ఉండాల్సిందేనని అన్నారు. ప్రశాంత వాతావరణంలోనే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయని గుర్తు చేశారు. ఆధునిక సాంకేతికత ఆసరాతో నేరాలను అరికట్టాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

======================

ఆవిష్కరణలు, వాణిజ్యం, నైపుణ్యాభివృద్ధి రంగాలలో న్యూ సౌత్ వేల్స్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల మధ్య ఒప్పందాన్ని సులభతరం చేయాలని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. న్యూ సౌత్ వేల్స్ ప్రీమియర్ క్రిస్ మిన్స్ తో మంత్రి మర్యాదపూర్వకంగా ఈ రోజు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అడ్వాన్స్ డ్

మ్యానుఫ్యాక్చరింగ్, స్టార్టప్‌లు, గ్రీన్ టెక్నాలజీలలో సహకారాన్ని ప్రోత్స హించేందుకు ఆంధ్రప్రదేశ్ – న్యూ సౌత్ వేల్స్ ఇన్నోవేషన్ ఇండస్ట్రీ భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. అదే విధంగా న్యూ సౌత్ వేల్స్ ఇన్నోవేషన్ క్లస్టర్లను ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే ఇన్నోవేషన్ స్టార్టప్ హబ్‌లతో అనుసంధానించే ఎక్స్ఛేంజ్ కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాలని పేర్కొన్నారు. రెన్యూవబుల్ ఎనర్జీ, మెడిటెక్, అగ్రిటెక్, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో పని చేస్తున్న న్యూ సౌత్ వేల్స్ కంపెనీలు ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సాహించాలన్నారు.

=====================

విశాఖపట్టణంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కావడంతో రాష్ట్రం విశేష అభివృద్ధిని సాధిస్తుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ తెలిపారు. విశాఖలో ఈ రోజు జరిగిన ఒక కార్యక్రమంలో గూగుల్ ఎఐ డేటా సెంటర్‌పై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రానున్న కాలంలో విశాఖ అంతర్జాతీయంగా కీలక పాత్ర పోషించనుందని  చెప్పారు. విశాఖ కేంద్రంగా యువతకు మంచి అవకాశాలు రాబోతున్నాయని పీవీఎన్ మాధవ్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

=====================

రేపటి నుంచి 3 రోజుల పాటు యూఏఈలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్నారు. రాష్ట్రానికి పెట్టుబడుల సాధన కోసం ముఖ్యమంత్రి బృందం ఈ  పర్యటన చేపట్టనుంది. రేపు ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నుంచి దుబాయ్ కి చంద్రబాబు నాయుడు బయలుదేరి వెళ్లనున్నారు. వివిధ అంతర్జాతీయ సంస్థల యాజమాన్యాలు, ప్రతినిధులతో ముఖాముఖీ సమావేశాలలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. అదే విధంగా పారిశ్రామికవేత్తలతో పాటు యూఏఈకి చెందిన ప్రభుత్వ ప్రతినిధులతోను సమావేశమవుతారు. దుబాయ్ లో సిఐఐ రోడ్ షో కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు పాల్గొంటారు. అలాగే దుబాయ్ లో AP NRT ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు డయాస్పోరా సమావేశానికి ముఖ్యమంత్రి హాజరవుతారు. వచ్చే నెల 14, 15వ తేదీల్లో విశాఖలో జరగనున్న పార్టనర్ షిప్ సమ్మిట్ కు వివిధ సంస్థల ప్రతినిధులను ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు ఆహ్వానిస్తారు.

విరామం

=====================

రాష్ట్రంలో అదనంగా ఏడు కొత్త డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ రోజు ఒక ప్రకటనలో వెల్లడించారు. విజయనగరం జిల్లా ఎస్.కోట, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, చిత్తూరు జిల్లా పీలేరు ఏరియా ఆసుపత్రిలో, పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటగిరి, బాపట్ల జిల్లా అద్దంకి, నంద్యాల జిల్లా సున్నిపెంట సీహెచ్‌సీ ఆసుపత్రుల్లో ఈ డయాలసిస్ కేంద్రాలు కొత్తగా రానున్నాయని మంత్రి చెప్పారు. ప్రతి కేంద్రంలో రోజు మూడు సెషన్ల ద్వారా 15 మందికి చొప్పున రక్త శుద్ధి జరుగుతుందని తెలిపారు. ప్రధానమంత్రి నేషనల్ డయాలసిస్ ప్రోగ్రాం కింద ఏర్పాటు కానున్న ఒక్కొక్క కేంద్రంలో సుమారు 75 లక్షల రూపాయల విలువ చేసే 3 రక్త శుద్ధి యంత్రాలు, వైద్య పరికరాలు సమకూరుతాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 232 కేంద్రాలు పని చేస్తున్నాయి. రానున్న కొత్త వాటితో కలిపి వీటి సంఖ్య 239కు చేరుకుంటుందని చెప్పారు.

=====================

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా బాణసంచా పేలుడు ఘటనలో మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ 15 లక్షల రూపాయలు చొప్పున పరిహారం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రితో హోం మంత్రి వంగలపూడి అనిత ఈ రోజు సమావేశం అయ్యారు. బాణసంచా పేలుడు ఘటనపైన అధికారులు ముఖ్యమంత్రికి నివేదికను అందించారు. లైసెన్సు ఇచ్చే ముందు నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనేది అధికారులు తనిఖీలు నిరంతరం చేయాలని చంద్రబాబు నాయుడు సూచించారు. అలాగే తయారీ కేంద్రాల

వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం లేని తయారీ కేంద్రాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించొద్దని ముఖ్యమంత్రి ఆదేశించారు. అదే విధంగా నిబంధనలు ఉల్లంఘిస్తే పీడీ యాక్ట్ కేసులు పెట్టి కఠినంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

======================

ఆదర్శ ఆసుపత్రిగా శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని తీర్చిదిద్దుతామని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రంలో విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను మంత్రి ఈ రోజు తనిఖీ చేశారు. అనంతరం ప్రభుత్వ వైద్య కళాశాలలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్,తో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఓపీలో సీనియర్ వైద్యులు కూడా తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని సూచించారు. అన్ని విభాగాల్లో వైద్యులను షిఫ్ట్ పద్ధతిలో కేటాయిస్తూ.. రోస్టర్‌ను ప్రదర్శించాలని ఆదేశించారు. అదే విధంగా ఆసుపత్రిలో ఆపరేషన్ల సంఖ్యను పెంచాలన్నారు.

======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 127వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 24వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

======================

రాష్ట్రంలో జూద గృహాల నిర్వహణ విషయంలో పోలీసులు తీసుకున్న చర్యలను నివేదిక రూపంలో తెలియజేయాలని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పోలీసు అధికారులను కోరారు. రాష్ట్రంలో చట్ట విరుద్ధంగా జూద కేంద్రాలు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. జూదం ఆడటం, జూద కేంద్రాలు నిర్వహించడం, ప్రోత్సహించడం చట్ట రీత్యా నేరమని చెప్పారు.

======================

నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయువ్యంగా కదిలి రానున్న 36 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. ఉపరితల అవర్తనం పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ రేపు మధ్యాహ్నం నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్.నారాయణ తెలియచేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

======================
======================